వైద్య విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రినిపల్ డాక్టర్ ఎ.సురేఖ మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. రాయల సీమ జోనల్ సిఎంఇ ఫీటల్ మెడి సిన్ 2024 జూన్ 30న రేడియోడియాగ్నోసిస్ విభాగం వారు 9 ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నిర్వహించారు. కార్యక్రమంలో రాయల సీమజోన్ నుంచి విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో కడప విద్యార్థులు ఎన్. మన్యత రెడ్డి రెండవ బహుమతిని గెలుచుకోగా, కె. సుదీప్ వాస్ మూడవ బహుమతి సాధించారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పాఠశాలలు, హాస్టళ్లలో
ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి

- కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్ళలో ఆరోగ్యకర, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, విద్యా, సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరే ట్‌లోని గ్రీవిన్స్ సెల్ హాలులో ఎంఇఒలు, సంక్షేమ శాఖలు, వైద్యారోగ్యశాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాజాగా ఖాజీపేట బాలికల పాఠశాలలో నీటి కలుషితం, విద్యార్థుల అస్వస్థతపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఆరోగ్యకర, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, అందుకోసం మండల విద్యాశాఖాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. తాజాగా ఖాజీపేట మండలంలో బాలికల పాఠశాలలో నీటి కలుషితం, విద్యార్థులు అస్వస్థతకు గురికావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. తక్షణ చర్యల్లో భాగంగా అన్ని సంక్షేమ శాఖల అధికారులు సంబంధిత హాస్టళ్లలో, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మంచినీటి సదుపాయాలు, వాటర్ ట్యాంకుల పారిశుధ్యంపై మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. వైద్యాధికారులు ఆయా మండలాల్లో ఆరోగ్య పరిరక్షణ, జాగ్రత్తలు పట్ల ప్రజల్లో పాఠశాలల విద్యార్థుల్లో అభగహన కల్పించాలన్నారు. ప్రధానంగా ఎంఇఒ లు, ఎంఇఒ-2 లు అందరూ మండల పరిధిలోని పాఠశాలల్లో వాటర్ ట్యాంకులూ, కుళాయిలు, మధ్యాహ్న భోజన నిర్వహణ చర్యలను పరిశీలించాలన్నారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి వాటర్ ట్యాంకులని శుభ్రం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో వెంటనే వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించి ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు సురక్షితమైన మంచినీటిని అందించాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాలకు ఎలాంటి కొరత లేకుండా బాధ్యతతో సదుపాయాలను సమాకూర్చాలని సూచించారు. ముఖ్యంగా వంట మనుషులకు వంట నిర్వహణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి భోజన శాలలను శుచిగా శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్లలో విధిగా పారిశుధ్య చర్యలను చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లల శుభ్రత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోషక విలువలున్న ఆహారం అందించేలా సంక్షేమ శాఖల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. రోజూ విద్యా ర్థులకు ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పారిశుధ్యం, శుద్ధమైయిన ఆహారపు లావాట్ల గురించి తెలియజేయాలన్నారు. డయేరియా, ప్రజారోగ్య భద్రత, పారిశుధ్య చర్యలు చక్కబెట్టేందుకు జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పాఠశాలలో వాటర్ ట్యాం కులన్నింటినీ వెంటనే శుభ్రపరిచి ఎక్కడ ఓపెన్ ట్యాంకులు లేకుండా చూడా లన్నారు. డయేరియా, కలరా లాంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య భద్రతా, పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో ప్రజలను చైతన్య పరచాలన్నారు. అలాగే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతి గ్రామంలో అన్ని గృహాలలో కుళాయి నీటి సదుపాయం నిర్వహణ పనులను పరిశీలించి రాండంగా నీటి పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, డిఇఒ అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, మైనార్టీ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి, బిసి వెల్ఫేర్ అధికారి డాక్టర్ వి. బ్రహ్మయ్య, డిజేబుల్, మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కృష్ణ కిశోర్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఇమ్రాన్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ రామరాజు

కలెక్టర్లు బదిలీ

కడప కలెక్టర్‌గా లోతేటి శివశంకర్
అన్నమయ్య కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగ ళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 జులైలో కడప కలెక్టర్‌గా విజయరామరాజు బాధ్యతలు స్వీకరిఒచారు. ఈయన 2024 జులై 02వ తేదీ వరకు సుమారు మూడేళ్లపాటు సేవలం దించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కొత్తప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో అధికారులను బదిలీలు చేస్తోంది. ఇందులోభాగంగానే మొదటి విడత కింద ఇటీవల రాష్ట్రంలోని సుమారు 18 జిల్లాలకు చెందిన కలెక్టర్లను బదిలీ చేసింది. తాజాగా మిగిలిపోయిన కలెక్టర్లను ఆయా స్థానాలకు బదిలీలు చేసింది. ఇందులోభాగంగా కడప కలెక్టర్‌గా లోతేటి శివ శంకర్ రానున్నారు. ఈయన బాధ్యతల నిర్వహణలో తనదైన ముద్రవేసినట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం లోపు కలెక్టర్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్ స్థానంలో చామ కూరి శ్రీధర్‌ను బదిలీ చేసింది. ఈయన సైతం సత్వరమే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి బదిలీపై వెళు న్న కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్ 2024 జవనరి 31న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్నెళ్లలోపే బదిలీ కావడం గమనార్హం.

లోతేటి శివశంకర్

చామకూరి శ్రీధర్

లోతేటి శివశంకర్ సేవలు

గుంటూరు జిల్లా నుంచి విభజిత జిల్లా పల్నాడుకు ప్రథమ కలెక్టర్‌గా జయప్రదంగా విధులు నిర్వహించిన ఘతనను సొంతం చేసుకున్నారు. రెండేళ్ల వ్యవధిలోనే తనదైన శైలిలో ఎన్నో వినూత్న కార్యక్రమాలతో కూడిన సేవలందించారనే పేరు పొందారు. ఇందులో మచ్చుకు కొన్నింటిని ప్రస్తావించుకోవాల్సి ఉంది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల కోసం వచ్చిన అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం కల్పించడం మొదలుకుని ఆయా జిల్లాల ప్రత్యేకత ఆధారంగా సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం, నెల నెలా సాహిత్య మేళా, అంధుల కోసం ప్రత్యేక కార్యక్రమం, స్వాతంత్ర్య సమరయోధులు, బిఆర్ అంబేద్కర్ వంటి స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాలు, ఇతర గొప్ప గొప్ప ఛాయాచిత్ర ప్రదర్శనలను ప్రోత్సహించడం, విద్య ఉపాధి రంగాలలో నవోదయం, రైతుకు వం దనం, టెన్త్ టాపర్లకు అభినందన, ఏ డే విత్ కలెక్టర్ పేరిట విద్యా ర్థులతో మమేకం కావడం, గ్రామోదయం, నగరోదయం, కాఫీ విత్ క్లాప్‌మిత్ర, మిషన్ శోభకృత్, సంక్రాంతి సంబరాలు, ఆడపిల్లల్లో రక్త హీనతను అధిగమించడానికి ఉద్దేశించిన బంగారుతల్లి 2.0 వంటి కార్యక్రమాలను జయప్రదంగా అమలు చేయడంతో ఐఎస్ఓ 9001 గుర్తింపు లభించింది. దీనికితోడు చేపట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సామాన్యులతో మమేకమై ప్రజా కలెక్టర్‌గా మన్నలు పొందడం గమనార్హం.

సాయిబాబా హైస్కూల్‌లో
పెచ్చులూడిన తరగతి గది పైకప్ప

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు
- చికిత్స కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలింపు
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి చెందిన పాఠశాలలో ఘటన
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశం
- ఘటనపై ఆరా తీసిన కడప ఎమ్మెల్యే మాధవి



పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న తాలుకా పోలీసులు

ప్రజాశక్తి కడప అర్బన్

కడప నగరంలోని ఐటిఐ సర్కిల్‌లో వైసిపి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాఠశాల మూడో అంతస్థులో ఉన్న 8వ తరగతి గది స్లాబ్ పెచ్చులు ఊడి పడింది సంఘటనలో పాఠాలు వింటున్న ఆరుగురి విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఒక విద్యార్థి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం వారిని యాజమాన్యం నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. సాయిబాబా పాఠశాలలోని 8వ తరగతి ఇ-1 సెక్షన్ గదిలో మధ్యాహ్నం సమయంలో ఉపాధ్యాయులు బోధించే సమీపంలో మూలన ఉన్నట్టుండి స్లాబ్ పైకప్పు పెచ్చులూడింది. అక్కడ బెంచ్‌లో కూర్చుని పాఠాలు వింటున్న విద్యార్థులకుపై పడడంతో ఆరుగురికి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఊహించని సంఘటనతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే స్పందించిన యాజమాన్యం గాయపడిన విద్యార్థులను వెంటనే ప్రయివేట్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. ఒక విద్యార్థికి తలకు గాయమై కుట్లు పడినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని కనీసం వసతులు, నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయిబాబా పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి. రామచంద్రారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉండడం గమనార్హం. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. అక్కాయపల్లెలోని ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న ప్రయివేట్ పాఠశాలలో పైకప్పు కూలి ఆరుగురు విద్యార్థులు గాయపడిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసిందని, సంబంధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు. అలానే నిబంధనలు పాటించకుండా స్కూలు నడుపుతున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని అంటూ పోస్ట్ చేశారు. ఇదే ఘటనపై కడప ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ పాఠశాలపై కప్పు కూలి విద్యార్థులకు గాయాలు కావడం బాధాకరం. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాను. ఈ సంఘటనపై డిఇఒ వెంటనే స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. చట్ట విరుద్ధంగా పాఠశాల నడుస్తున్నట్లు తమ వద్ద గతంలోనే సమాచారం ఉందని తెలిపారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనపై విచారించారు.

సాయిబాబా స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

విద్యార్థి, యువజన సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

నగరంలోని ఐటిఐ కూడలిలో ఉన్న సాయిబాబా స్కూల్ యాజ మాన్యం నిర్లక్ష్యం కారణంగా స్కూల్ పై కప్పు కూలి 8వ తరగతి విద్యా ర్థులు తీవ్రంగా గాయపడ్డారని, స్కూలు గుర్తింపు రద్దు చేయాలని, సంఘ టనకు బాధ్యునిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్కూల్ ఎదుట విద్యార్థి యువజన సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేందర్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, గండి సునీల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బాబు, పిఎస్‌యు గోపి, పిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సన్నీ, ఎఐవైఎల్ జిల్లా నాయకులు ఓబయ్య మాట్లాడుతూ ఇంత జరుగుతున్నా డిఇఒ, ఆర్‌జెడి కనీసం స్కూల్ తనిఖీ కూడా రాలేదని చెప్పారు. ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు దగ్గర వేల రూపాయలు వసూలు చేసి, అక్రమ డబ్బుతో ఎమ్మెల్సీ అధికారాన్ని అడ్డు పెట్టుకుని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉన్న విద్యాశాఖ చర్యలు తీసుకోకపోవడం దేనికి నిదర్శనమన్నారు. సాయిబాబా స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, ఉపాధ్యక్షులు మనోజ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నర్సింహులు, మిగతా విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొన్నారు.

మోడీ పాలనలో ఉన్నత విద్య నిర్వీర్యం

- దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి
-ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్వీర్యం చేయటాన్ని నిరసిస్తూ ఈ నెల 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ ఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో బంద్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు గుజ్జుల వలరాజు,గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి తన వైఖరిని స్పష్టంగా తెలుపుతూ ప్రాథమిక విద్యను మొదలుకుని ఉన్నత విద్యారంగ విలువలకు ఉరితాళ్లు బిగిస్తుందని చెప్పారు. అందువల్లనే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఎంట్రన్స్, ఆయా శాఖలో ప్రవేశ పెడుతూ ఉన్నత ప్రమాణాల నాణ్యతను, విద్యార్థుల ప్రతిభను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగానే నీట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు ముందుగానే లీక్ కావడం నీట్ పరీక్ష రద్దు కావడం చాలా సిగ్గుచేటని తెలిపారు. నీట్ సంస్థను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరిగి నీట్ పరీక్షలు నిర్వహించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైవీయూ రిజిస్ట్రార్‌ను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్లు రామచంద్రారెడ్డి, జోగిరామ్ రెడ్డి, జూనియర్ కళాశాల రాజగోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి అసోసియేషన్లు, అలాగే డిగ్రీ కళాశాల అసోసియేషన్ జూనియర్, డిగ్రీ, స్కూల్, ఫార్మసీ, ఇంజినీరింగ్ అన్ని రంగాల వారు స్వచ్ఛందంగా బంద్‌కు సంపూర్ణం మద్దతు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివశంకర్, ఆనంద్, మస్తాన్, అశోక్, సల్మాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

ఆర్‌జెడి అవినీతిపై చర్యలకు జాప్యమెందుకు? : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుత కడప ఆర్‌జెడి రాఘవరెడ్డి కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉన్న సమయంలో వచ్చిన అనేక అవినీతి ఆరోపణలపై కలెక్టర్ వేసిన విచారణ కమిటీ తమ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదని, అవినీతి అధికారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ మాజీ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి గండి. సునీల్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ వద్దనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్‌తో విచారణ కమిటీ వేశారని తెలిపారు. ఆ విచారణ కమిటీకి అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉన్న రాఘవ రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎస్ఎఫ్ఐ ఆధారాలు అందజేసిందని తెలిపారు. అప్పట్లో రాఘవరెడ్డికి వైసిపి నాయకుల అండదండలు ఉండటంతో అధికారులు అతనిపై చర్యలు తీసుకోకపోగా ఆర్‌జెడిగా ప్రమోషన్ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కడప ఆర్‌జెడి రాఘవరెడ్డి అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కలెక్టర్ వేసిన విచారణ కమిటీ వారి నివేదిక బయట పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రనికి ప్రత్యేక హోదా సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లాగ మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కనీసం నోరు విప్పడం లేదన్నారు. మోడీ సర్కార్‌లో కీలకంగా ఉన్న మీరు హోదాపై ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరణ అని ఎందుకు అడగడం లేదని, మోసం చేసిన మోడీతో హోదాపై సంతకం ఎందుకు పెట్టించలేరని, ప్రత్యేక హోదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలని అన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిమండలం విజయ్ సుశీల్ కుమార్,యువజన కాంగ్రెస్ ఆర్టిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అమీర్‌బాషా, ఎన్ ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, యువజన కాంగ్రెస్ అన్నయ్య జిల్లా ఉపాధ్యక్షులు నందిమండలం వెంకటసుబ్బయ్య, యువజన కాంగ్రెస్ ఆర్‌టిఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాసరి శివశంకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య

ధర్నా చేస్తున్న బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం నాయకులు

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి కళ్యా సుధాకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని జాయింట్ ఫోరం బిఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు సి. సుబ్బారెడ్డి, డివిజన్ కార్యదర్శి కల్యా సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యూఢిల్లీ వారి పిలుపుమేరకు ధర్నా చేపట్టామని తెలిపారు. పెన్షన్ రివిజన్ 2017, జనవరి 1 నుంచి 15 శాతం పెంపుతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎస్. భాస్కర్, నాయకులు కె.వెంకటరమణ, ఎస్.ఎస్. రాజు, ఎస్. సుబ్బరాయుడు, బద్వేల్ బ్రాంచ్ కార్యదర్శి బి.సి.బాలయ్య, ప్రొద్దుటూరు కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, జమ్మలమడుగు కార్యదర్శి వి.హనుమంతరావు, రాజంపేట కార్యదర్శి సంగీతరావు, రెడ్డయ్య, మహిళా సభ్యులు కోనే. విజయలక్ష్మి, జయమ్మ వెంకటలక్ష్మి, పెన్షనర్లు పాల్గొన్నారు.

విశ్వ వ్యాప్త వైద్య సేవకు సింధు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈనెల5 నుంచి 20 వరకు ఫీజీ దేశంలో నిర్వహించే హార్ట్ సర్జరీ క్యాంపులో నగరంలోని 3వ డివిజన్‌లో ఉన్న అప్పల రెడ్డి సింధు పాల్గొనున్నారు. ఈమె ప్రొద్దుటూరు సమతా నర్సింగ్ కళాశాలలో జిఎన్ ఎమ్ పూర్తి చేశారు. కడప నగరం శంకరా పురంలో ఉన్న డాక్టర్ జి ఆర్‌కె ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో దాదాపు 8 సంవ త్సరాలు వైద్య సేవలు అందించారు. 6 నెలల కిందట సద్గురు మధుసూదన సాయి స్వాముల వారు స్థాపించిన సత్య సాయి సరళ కార్డియాలజీ మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఐసీయూ వి భాగంలో సేవలు అందిస్తూ ఉన్నారు. హార్ట్ సర్జరీ క్యాంపులో సీనియర్ కార్డియాలజీ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ ఆనంద్ అగర్వాల్, డాక్టర్ పూజా నటరాజన్ టీంలో సేవలు అందించడానికి ఫిజీ దేశంలో ఉన్న సత్య సాయి సరళ సంజీవిని కార్డియాలజీ సెంటర్‌కు వెళుతూ ఉన్నారు. ఫిజీ దేశానికి వెళుతున్న వైద్య సిబ్బందికి హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ అండ్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, కడప ఉమ్మడి జిల్లాల పర్సన్ డేవిడ్, కళ్యాణ్ రాజు, నేషనల్ చైర్ పర్సన్ తా ల్లూరి ప్రసన్నకుమార్, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆపన్న హస్తం వన్‌స్టాప్ సెంటర్

ప్రజాశక్తి - కడప : ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి రిమ్స్ ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఒకే చోట అనేక సేవ లున్నాయని, అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం ,మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం ,తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయని పేర్కొన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ,యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్లు , సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు , వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు సంప్రదించవచ్చు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల అరియర్స్, ఇన్సెంటివ్ ఇవ్వాలని పేర్కొన్నారు. జెనోకో, ట్రాన్స్‌కో, డిస్కంలలో 20 సంవత్సరాలుగా ఈ సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను అప్పటి సిఎం జగన్ రెగ్యులర్ చేస్తామని చెప్పి మాటతప్పి, మడమ తిప్పిన వల్లనే ఓటమి చవి చూశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి వీరందరినీ నియ మించాలని ప్రభుత్వాన్ని యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేస్తుందని చెప్పారు. పై విషయాలన్నీ చర్చించడం కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఈనెల 7న ఎన్‌పిఆర్ భవన్, సిఐటియు రాష్ట్ర కార్యాలయం, దుర్గాపురంలో నిర్వహి స్తున్నారని చెప్పారు. రాష్ట్ర కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. నూతన కూటమి ప్రభుత్వ విధానాలు మన కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కార్యాచరణపై విజయవాడలో కమిటీ చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తారని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి కొండయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి సమస్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి-చెన్నూరు : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదని డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానో పాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో ఎన్ని పాఠశాలల్లో ఆర్ఒ ప్లాంట్‌లు న్నాయి, తాగునీటి కుళాయిలున్న పాఠశాలలు ఎన్ని ఉన్నాయి, వాటి పర్యవేక్షణ, ఇబ్బందుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపా ధ్యాయుల పైన ఉందని ఆయన తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకులున్న పాఠ శాలల్లో నెలలో ప్రతి మొదటి, నాలుగవ వారం ఆయా ట్యాంకులను శుభ్రపర చాలని ఉపాధ్యాయులకు సూచించారు, విద్యార్థులకు ఆరోగ్యం, శుభ్రత గురించి తెలియజేయాలని, విద్యార్థులందరూ విధిగా మధ్యాహ్నం భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని దీనిపై అవగాహన కల్పించాలన్నారు, ముఖ్యంగా వర్షాకాలం అవడం వల్ల పాఠశాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి అక్కడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభంకు పాఠశాల శుభ్రతపై తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 సునీత, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరైన సమయంలో టీకాలు వేయిస్తేనే సురక్షం

ప్రజాశక్తి- చింతాకొమ్మదిన్నె : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలోనే చింతకొమ్మదిన్నె మండలాన్ని ఆస్పరేషనల్ ఆస్పిరేషనల్ చేర్చారని, ప్రతి ఒక్క ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్త, సూపర్‌వైజర్లు కలిసి తమకు ఇచ్చిన లక్ష్యాన్ని మూడు నెలల్లో సాధించాలని సూచించారు. గర్భిణుల నమోదు చేయడం, వారికి పూర్తి సర్వీసులు అందించడం, తక్కువ నెలలు బిడ్డలు పుట్టకుండా చూడడం, పుట్టిన ప్రతి బిడ్డకీ వ్యాధి నిరోకటికాలు సకాలంలో వేయించడం, టిబి వ్యాధి ప్రబలకుండా సరైన సమయంలో కనుగొని సరియైన చికిత్స చేయడం, షుగర్ వ్యాధి, అధిక రక్తపోటును గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చు అని చెప్పారు. డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ గర్భస్థ పూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఇఒ కృష్టప్పా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డిప్యూటీ డిఇఒ కృష్టప్పా

ప్రజాశక్తి - వేంపల్లె (వీరపునాయునిపల్లె)

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాబోధనతోపాటు నాణ్యమైన భోజనం వడ్డించాలని ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్టప్పా సూచించారు. వీరపునాయనిపల్లి మండలంలోని పాయసంపల్లె ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ప్రతి విద్యార్థికి అందజేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఉన్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

97 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో 97 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిందని ఎంపీడీవో సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల నుంచి పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. కొన్ని గ్రామాల్లో కొద్దిసేపు సర్వర్ పని చేయకపోవడంతో కాస్త ఆలస్యం జరిగిందన్నారు. అయితే తిరిగి పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. మండలంలో 5,520 పెన్షన్లు ఉండగా 5,350 పెన్షన్ పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారు గ్రామాల్లో అందుబాటులో లేరన్నారు.

5న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 5న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదాలత్ కార్యక్రమం పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులోని సెక్రటేరియట్‌లో నిర్వహిస్తారన్నారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కార వేదిక దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

రెండు నెలలపాటు చేపల వేట నిషేధం

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టులో రెండు (జులై,ఆగష్టు) నెలలపాటు చేపలు వేటను నిషేధించినట్లు మత్స్యశాఖ అధికారిని మల్లీశ్వరి తెలిపారు. ఈ రెండు నెలలు చేపలు సంతానోత్పత్తి ప్రక్రియ జరిగే కాలమని తెలిపారు. చేపలు గుడ్లను కలిగి ఉంటాయని, ఈ సమయంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపలు వేట నిషేధమన్నారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

సాయిబాబా ఉన్నత పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప నగరంలోని సాయిబాబా ఉన్నతపాఠశాలలో 8వ తరగతి గదిపైకప్పు పెచ్చులూడడంతో ఆరు మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరుమందిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయన్నారు. ఈ సంఘటనపై విద్యాశాఖాధికారులు తక్షణం స్పందించాలన్నారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాన్ని చట్టపరంగా శిక్షించాలన్నారు. ఉపాధ్యాయులకు కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, ఆ ప్రకారం కనీస వసతులు కల్పించనట్టైతే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాఠశాలను సీజ్ చేయాలి : ఒంటేరు

నాసిరకమైన భవనాల్లో పాఠశాలను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాఠశాలను అధికారులు సీజ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కడప నగరంలోని ఎమ్మెల్సీకి చెందిన సాయిబాబా పాఠశాల పైకప్పు కూలి విద్యార్థులకు గాయాలు కావడం బాధాకరమన్నారు. గతంలోనే ఈ పాఠశాల చట్టవిరుద్ధంగా నడుపుతున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. అయినప్పటికీ అప్పటి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల నేడు విద్యార్థులకు ఈ దుస్థితి కలిగిందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కూడా రామచంద్రారెడ్డి పలువురు అధికారుల సాయంతో నిబంధనలను తుంగలో తొక్కి దొంగ ఓట్లు సృష్టించి ఎన్నికల్లో అక్రమంగా గెలిచారని ఆరోపించారు. దీనిపై అప్పటి కలెక్టర్‌కు, ఎన్నిల అధికారులకు ఫిర్యాదులు అందినా వారు స్పందించకపోవడం బాధాకరమన్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, భవిష్యత్లుతో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గురువారం దేశవ్యాప్తంగా కెజి నుంచి పిజి వరకు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్, మండల అధ్యక్షుడు లీలాకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి, ఏజెన్సీ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మల్లికార్జున, లక్ష్మీనారాయణ, కార్తీక్, రామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దముడియం

జమ్మలమడుగు డివిజన్ జిల్లా ఉప ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతి కళ మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద పసుపుల కెజిబివి పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదిని, ఆహార పదార్థాలను పరిశీలించారు. నీటి ట్యాంక్, వాటర్ ఫిల్టర్ గదిని పరిశీలించి ప్రిన్సిపల్ మౌనికకు తగు సూచనలు చేశారు. విద్యార్థులను సమావేశపరిచి స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించార. కార్యక్రమంలో మేడిదిన్నె వైద్యాధికారి మహమ్మద్ హుస్సేన్, సూపర్వైజర్లు సోము వెంకటరమణ, శాంతకుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభ్రతపట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శాంతికళ

రహదారులకు నోచని పాతపాలెం

వీధిలో నిలిచిన వర్షపునీరు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధి 14 వార్డులోని పాతపాలెం రహదారులకు కూడా నోచుకోలేదు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు వేరే మార్గాలను ఎంచుకొని ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే గ్రామంలో సిమెంట్ రోడ్లు ఉన్నప్పటికీ మురుగునీరు రోడ్లపై నిలుస్తూ ఇబ్బందికరంగా మారింది. చిన్నపాటి వర్షం పడితేచాలు వర్షపునీరు రోడ్డుపై నిలిచి దుర్వాసన, దోమల ఆవాసంతో స్థానికులు అల్లాడిపోతున్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి డ్రయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. పాత పాలెం గ్రామం మైదుకూరు పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అభివృద్ధిలో మాత్రం ఎంతో వెనుకబడి ఉంది. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి ఏకగ్రీవంగా అభ్యర్థిని ఎన్నుకున్నారు. అయినా ఆశించినస్థాయిలో అభివృద్ధి లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పాతపాలెం గ్రామంలో డ్రయినేజీ ఏర్పాటు చేసి గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గాన్ని కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ వార్డు పరిధిలోని మరో గ్రామం సర్వాయి పల్లె నుండి మైదుకూరుకు వచ్చేందుకు నేషనల్ హైవే కింది భాగాన ఉన్న కల్వర్టుల్లో వర్షపు నీరు నిలుస్తూ గ్రామస్తుల రాక పోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. గతంలో అనేకసార్లు ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా తొలగించుకునే ప్రయత్నం చేశారు.

అధ్వానంగా ఉన్న పాతపాలెం గ్రామ గ్రావెల్ రోడ్డు

అర్హత ఉన్నా.. పింఛన్లు నిలిపేయడం అన్యాయం

మండల కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పింఛను అందని లబ్ధిదారులు

ప్రజాశక్తి - చాపాడు

పెన్షన్ పొందేందుకు అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ టిడిపి నాయకుల కక్ష రాజకీయంతో పెన్షన్లు ఆపడం సరికాదని వైసిపి మండల నాయకులు టిఓ పల్లె రవిశంకర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మడూరు, టిఓ పల్లె, అన్నవరం గ్రామాల్లో రాజకీయ కక్షలతో పెన్షన్ అందని వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, వితంతువులతో ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2014 టిడిపి ప్రభుత్వంలో పెన్షన్ పొందిన వృద్ధులు ప్రస్తుతం అనర్హులు ఎలా మారుతారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేశారనే అనుమానంతో టిడిపి నాయకులు అక్రమంగా ఫిర్యాదులు చేసి పెన్షన్ రాకుండా అడ్డు తగలడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా చాపాడు మండలంలోని మూడు గ్రామాల్లో మాత్రమే పెన్షన్లను నిలుపుదల చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా చర్యలు తీసుకొని సమగ్ర విచారణ చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలన్నారు.

కలెక్టర్ చొరవతో పింఛన్ల పంపిణీ..

మండల పరిధిలోని మడూరు, అన్నవరం, టిఓ పల్లి గ్రామాల్లో 94 మంది పెన్షన్‌దారులకు వెంటనే పంపిణీ చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిడిఒ రహంతుల్లయ్య చర్యలు చేపట్టి పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం పెన్షన్ పంపిణీకి చర్యలు చేపట్టారు. అర్హులైన అందరికీ పెన్షన్ అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తాము అన్ని విధాలా అర్హులమని పెన్షన్‌దారులతో రాతపూర్వకంగా తీసుకుని పెన్షన్లు పంపిణీ చేశారు.

పింఛను అందలేదని డయాలసిస్ రోగి ఆవేదన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

తనకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందలేదని మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కలివేల మరియన్న అనే డయాలసిస్ రోగి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అయిదేళ్లుగా వైసిపి ప్రభుత్వంలో పెన్షన్ అందేదని తెలిపాడు. ప్రతి మంగళవారం, శుక్రవారం చికిత్స కోసం వెళ్లాల్సి ఉందని తెలిపాడు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అంతోఇంతో సాయంగా ఉంటుందని సంతోషంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డయాలసిస్ పేషెంట్లకు రూ.10వేలు పింఛన్ ఇస్తారని తెలపడంతో సంతోషపడ్డాడు. అయితే పింఛన్ రాకపోవడంతో ఆయన ఆవేదన చెందుతున్నాడు. నెలకు రూ.10వేలుకుపైగా ఖర్చు వస్తుందని.. ఏమి చేయాలో అర్థంకాక అయోమయ స్థితిలో మరియన్న కుటుంబం ఉంది. పింఛను విషయమై సచివాలయం సిబ్బందిని అడగగా.. మీరు అనర్హుడు అని చూపిస్తోందని చెబుతున్నారని ఆవేదన చెందాడు. తనను ఆదుకోవాలని బాధితుడు సంబంధిత అధికారులను కోరుతున్నాడు. ఎవరు కూడా పట్టించుకోలేదంటూ బాధితుడు తెలిపాడు.

మరియన్న (డయాలసిస్ రోగి)

విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురి కావడం దురదృష్టకరం, బాధాకరమని మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడాన్ని డిఎల్ గమనించారు. స్థానిక ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య వివరాలను, పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించకపోవడం బాధాకరమన్నారు. కలుషిత తాగునీరు, అపరిశుభ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారని వైద్యులు నిర్ధారణకు వచ్చారు. పాఠశాల విద్యార్థులకు శుద్ధి నీరు అందించేందుకు తాను కృషి చేస్తానని, ఆ దిశగా చర్యలు తీసుకుంటానని డిఎల్ పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు పట్ల బాధ్యతారహితంగా ఉపాధ్యాయులు ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు కొందరు డిఎల్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డిఎల్ ఉపాధ్యాయులకు సూచించారు.

వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి

అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్సీ ఆరా

పిఆర్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెకు విచ్చేసిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని అధికారులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్సీని పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఎఇ వెంకటరమణ, గండి దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒ వెంకట సుబ్బయ్య, గండి ప్రధాన అర్చకుడు కేసరి స్వామితో పాటు టిడిపి నాయకులు ఎద్దుల కొండ్రాయుడు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జివి రమణ, కావాలి భానుకిరణ్, డివి సుబ్బారెడ్డి కలిశారు. సమస్యలను విన్నవించారు. గత ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులను ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు విస్తరణ పనులపై కూడా ఆరా తీశారు. గండి అభివృద్ధికి కృషి చేయాలని ఇఒ వెంకట సుబ్బయ్యను ఎమ్మెల్సీ కోరారు. అవినీతిని అరికట్టాలని పేర్కొన్నారు. పార్టీ పరిస్థితిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పని తీరుపై టిడిపి నాయకులు ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండలంలోని తువ్వపల్లె పాఠశాల వద్ద కొన్నేళ్లుగా వర్షపు నీరు నిలవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించేలా పనులు చేయాలని టిడిపి నాయకుడు డివి సుబ్బారెడ్డి కోరారు. ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

ఆపదలో ఉన్న మిత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని పతంగే రామన్నరావు శతాబ్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి సులాకే చక్రపాణికి ఆర్థికసాయం చేశారు. చక్రపాణి ప్రస్తుతం అనారోగ్య కారణంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నట్టు తెలుసుకున్న స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం స్థానిక ప్రేమ ఛా కేఫ్ వద్ద క్యాష్ అందజేశారు. ఈ సందర్భంగా 2002-2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు అందరూ మన పి.ఆర్. హైస్కూల్ సొసైటీ అనే ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ మేరకు తమతో కలిసి చదువుకొని ప్రస్తుతం ఇబ్బంది పడుతున్న తమ ప్రాణ మిత్రుడు సులాకే చక్రపాణికి తమవంతు సహాయంగా దాదాపు రూ.21,500 సమకూర్చారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బంధువులు, కుటుంబీకులు కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏమాత్రం సహాయం చేయడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో తనతో పాటు కలిసి చదువుకున్న తన ప్రాణమిత్రులు సహాయం చేసినందుకు కృతజ్ఞతలన్నారు. భవిష్యత్తులో తమతోపాటు చదువుకున్న ప్రాణమిత్రుల్లో ఎవరికైనా తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు తెలిస్తే తమవంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తోటి మిత్రులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పఠాన్ ఖాజా షరీఫ్ ఖాన్, కోవెలకుంట్ల ఖాజా మొహిద్దీన్, మార్తల జయవర్ధన్‌రెడ్డి, బేపారి మహమ్మద్ మజహర్ అలీ, పిట్టా రాముడు పాల్గొన్నారు.



చక్రపాణికి ఆర్థికసాయం చేస్తున్న తోటి మిత్రులు

ఆదర్శ పాఠశాలను సందర్శించిన 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో ఆదర్శ పాఠశాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి సందర్శించారు. బాలికల వసతి గృహంలో వంటగది, తాగునీటి కుళాయిలను, పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ శ్యామలదేవి పాఠశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన సమస్యగా హాస్టల్ ఆవరణలో రాత్రి లైటింగ్ సమస్య ఉందని, వెనుకవైపు గుట ప్రాంతం ఉండడం వలన రాత్రి సమ యంలో విషపురుగులు ఎక్కువగా వసతి గృహం లోకి పరిసర ప్రాంతాలలోకి వస్తు న్నాయని ఆయన దృష్టికి ఆమె తీసుకెళ్లారు. వెంటనే స్పందిన ద్వారకనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో లైటింగ్ కొరకు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. త్వరగా పాఠశాల ఆవరణంలో పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చెపిస్తానని, పాఠశాలలో లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ రూరల్ ఎడిఇ జయసుధాకర్ రెడ్డి

విద్యుత్ బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యుత్ బిల్లుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల రూరల్ ఎడిఇ జయసుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుల వసూలులో సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ బిల్లులను ప్రస్తుతం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా చెల్లించే అవకాశం ప్రస్తుతం లేదన్నారు. కేవలం డిస్కం యాప్, మొబైల్ యాప్ ద్వారానే చెల్లించే అవకాశం ఉందని, ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం, మండలంలోని సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని హామీలను అమలు చేయాలి

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం సామాజిక ఫించన్లు ఇంటి వద్దనే పంపిణీ చేయడం హర్షణీయమని, వీటితోపాటు మిగతా అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. తల్లికి వందనం, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం చేయాలని కోరారు. 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇచ్చే హామీని కూడా నిలుపుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని కోరారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. వీటి అమలుకు జిఒలు జారీ చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీలను ఎప్పటి నుండి అమలు చేస్తుందో ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కోరుతున్నట్లు తెలిపారు.

ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం 9కి వాయిదా

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీకి వాయిదా పడినట్లు ఎంపిడిఒ సుమిత్రమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరగాల్సిన సమావేశం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

కూరగాయల మార్కెట్ వేలం ..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

2024-25 ఆర్థిక సంవత్సరంలోని తాత్కాలిక కూరగాయల మార్కెట్ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి సంబంధించిన మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న తాత్కాలిక దిన కూరగాయ మార్కెట్‌తోపాటు వాహనాల పార్కింగ్ రుసుం వసూలుకు గుత్త హక్కుకోసం బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరుపవలసి ఉన్న బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు చెప్పారని జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ తెలిపారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం తాను నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను నాగబాబు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని జగదీష్ తెలిపారు.

నాగబాబును కలిసిన జగదీష్

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ